క్లుప్తంగా

వ్యవసాయ కుటుంబంలో విద్యా కుసుమం



నాదెండ్ల: ఇంటర్ ఫలితాల్లో వ్యవసాయ కుటుంబానికి చెందిన బాలిక సత్తా చాటింది. గణపవరం గ్రామానికి చెందిన నరిశెట్టి చంద్రయ్య, పద్మజ దంపతుల కుమార్తె వెన్నెల చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ ఇంటర్ పూర్తి చేసింది. వెయ్యి మార్కులకు గాను 983 మార్కులతో సత్తా చాటింది. 3–7తరగతులు చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో చదవగా, 8వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చిలకలూరిపేటలో చదివింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వడం అభినందనీయం

రొంపిచర్ల: మార్కెట్ యార్డు చైర్మన్ పదవి నరసరావుపేట నియోజకవర్గ చరిత్రలోనే బీసీ వర్గానికి కేటాయించటం ప్రథమమని జడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్‌గా బత్తుల చిన్నమ్మాయి రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందించి మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 60 శాతం మేర పదవులను కల్పించిందన్నారు. తమకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని కేటాయించటంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటామని యార్డు చైర్మన్ చిన్నమ్మాయి రామకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, చపారపు గోపాల్‌రెడ్డి, పడాల హనిమిరెడ్డి, గుండాల వెంకటేష్, కాటా రామిరెడ్డి, చింతగుంట అంజిరెడ్డి, జర్మనీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరోగసీ చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట: సరోగసీ చట్టం కింద అనుమతులు తీసుకున్న ప్రైవేటు హాస్పిటల్స్ యజమానులు ఆ చట్టం నిబంధనలకు లోబడి పనిచేయాలని, వాటిని అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. గురువారం తన చాంబర్‌లో డిస్ట్రిక్ అప్రాప్రియేట్ అథారిటీ ఫర్ ఏఆర్‌టీ (అసిస్టెంట్ రీప్రొడక్టీవ్ టెక్నాలజీ)/సరోగసీ చట్టం–2021 తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ చట్టం కింద నమోదుచేసుకున్న నరసరావు పేట శ్రేయ హాస్పిటల్ అండ్ ఐవీఎఫ్ సెంటర్, చిలకలూరిపేట వరలక్ష్మీ ఫెర్టిలిటీ అండ్ మెటర్నరీ హాస్పిటల్ వారి పత్రాలను పరిశీలించి అనుమతులు మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, గైనకాలజిస్టు డాక్టర్ కే.త్రివేణి, కమిటీ మెంబరు డి.శివకుమారి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి కనపర్రులో తిరునాళ్ల

నాదెండ్ల: నరసరావుపేట–చిలకలూరిపేట మార్గమధ్యంలో కనపర్రు బావి వద్ద బాలఏసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్లు పాదర్ పూధోట మరియ దాసయ్య తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. తిరునాళ్లకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

సోలాయిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

బొల్లాపల్లి: మండలంలోని గండిగనుమల సచివాలయ పరిధిలో సోలాయిపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్స్ కాన్సెప్ట్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు శంకరనారాయణ, వైద్యసిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గర్భిణులకు షుగర్, బీపీ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని వైద్యులు తెలిపారు.

సాతులూరులో మూడు చలివేంద్రాలు ప్రారంభం

నాదెండ్ల: మేజర్ పంచాయతీ సాతులూరు గ్రామంలో గురువారం పంచాయతీ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు చోట్ల తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ సర్పంచ్ శోభారాణి, కార్యదర్శులు రాఘవయ్య, రమేష్‌తో పాటూ సచివాలయ సిబ్బంది చలివేంద్రాలు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో, పాలకేంద్రం వద్ద, రెండో సచివాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సామాజిక తనిఖీలపై శిక్షణ

బొల్లాపల్లి: పాఠశాలల సామాజిక తనిఖీలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం మండల కేంద్రంలోని బండ్లమోటు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ చైర్మన్ కె.అపర్ణ మాట్లాడుతూ 2021 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థితి గతులపై శిక్షణలో వివరించారు. సామాజిక తనిఖీలు సమగ్ర సమాచారం పేర్కొనాలని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శిక్షకులుగా రీసోర్స్‌పర్సన్ సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమం– అదే జగనన్న లక్ష్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- మర్రిపాలెం గడపగడపకూ కార్యక్రమంలో హాజరు



మర్రిపాలెం గ్రామంలో గడపగడపకూ కార్యక్రమంలో మంత్రి రజిని

యడ్లపాడు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు పేదల తలరాతలు మారుస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. యడ్లపాడు మండలం మర్రిపాలెం గ్రామంలో గురువారం రాత్రి గడపగడపకూ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక మహిళలు తమ అడపడుచులా మంత్రి రజినిని సాదరంగా ఆహ్వానించారు. ముందుగా చర్చిల్లో స్థానిక పెద్దలు, పార్టీ నాయకులతో ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరి లబ్ధిని వివరిస్తూ... కరపత్రాలను అందిస్తూ.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ తెలుసుకుంటూ ఉత్సాహంగా కార్యక్రమాన్ని ముందుకు కొనసాగించారు. అర్హతే ప్రామాణికంగా అందుతున్న సంక్షేమ ఫలాలతో మహిళ జీవనోపాధి, కుటుంబ సంక్షేమానికి ఎంతో దోహదపడుతుందని స్థానిక మహిళలు మంత్రి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ప్రతిఇంటా ఉన్న సమస్యలన్నీ తొలిగి ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో స్థానికంగా ఏవైనా మౌలిక సదుపాయాలు అవసరమైతే ప్రాధాన్యత క్రమంగా పరిష్కరించాలని మంత్రి రజిని అధికారులను ఆదేశించారు. అర్హత ఉండి పథకాలు రాని వారిని గుర్తించి సంక్షేమం అందేలా చేయాలని చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని వాటిని సైతం రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న విషయాలను మంత్రి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ పారదర్శకంగా ఉంటాయని, వాటిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కులం, మతం, వర్గం, పార్టీ వివక్ష చూపకుండా అన్ని వర్గాల్లోని పేదలకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరాయంగా పనిచేస్తున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాచమంటి చింతారావు, దయాసాగర్, మర్రిపాలెం పార్టీ అధ్యక్షుడు వలేటి ఉదయ్‌కుమార్, సొసైటీ చైర్మన్‌లు బసెల శివరామకృష్ణ, ఓరుగంటి పూర్ణయ్య, నాయకులు దంటూ ఏసోబు, రాఘవయ్య, సామినేని శ్రీను, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు, షేక్ గౌసేసందాని, షంషుజుహా, వంకధారి శ్రీనుబాబు, 15వ ఆర్థికసంఘం సభ్యులు కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చందవరంలో గడప గడపకు

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పాల్గొననున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, శ్రేణులు హాజరుకావాలని కోరారు.

చౌకధరల దుకాణాల్లో రాగులు పంపిణీ

బొల్లాపల్లి: చౌకధరల దుకాణాల్లో కార్డుదారులకు ఉచితంగా రాగులు పంపిణీ చేయనున్నట్లు సీఎస్‌డీటీ వై.లక్ష్మణరావు గురువారం తెలిపారు. మే నెల నుంచి కార్డుదారులకు కేజీ నుంచి 4 కేజీల వరకు రాగులు పంపిణీ ఉంటుందన్నారు. ప్రస్తుతం అందజేస్తున్న బియ్యంలో ఒక కేజీ తగ్గించి వీటిస్థానంలో రాగులు అందజేస్తామన్నారు. అదేవిధంగా ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ సరఫరా జరిగిందని తెలిపారు. ఈ రేషన్‌కు సంబంధించి 2022 అక్టోబరు నుంచి 2023 మార్చి వరకు ఎండీయూ వాహనదారులకు సరఫరాపై వాహన చెల్లింపులు మంజూరు చేశామన్నారు. ఎండీయూ వాహనదారులకు ఇన్సూరెన్స్ నగదు తిరిగి చెల్లించినట్లు తెలిపారు.

జిల్లా అధికారిక లోగో సృష్టికర్తకు సన్మానం

బొల్లాపల్లి: మండల కేంద్రం జడ్పీహైస్కూల్లో పల్నాడు జిల్లా అధికారిక లోగో సృష్టికర్తను మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.మండలంలోని వడ్డెంగుంట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎ.కళ్యాణ్ సృష్టించిన లోగో పల్నాడు జిల్లా అధికారిక లోగోను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ క్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా అధికారిక లోగో సృష్టికర్త ఉపాధ్యాయుడు కళ్యాణ్‌ను ఘనంగా సత్కరించారు.

ఇళ్లు మంజూరుకు కృషి చేయాలి

శావల్యాపురం: అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికీ ఇల్లు మంజూరు అయ్యేలా క్షేత్రస్థాయిలో సచివాలయ ఇంజినీర్లు కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం గ్రామసచివాలయ ఇంజినీర్లుతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 1279 మంది జగనన్న లేఅవుట్స్‌లో అర్హత పొందిన లబ్ధిదారుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 40 కుటుంబాలు

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలోని 34వ వార్డు బీసీ కాలనీలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సమక్షంలో 40 కుటుంబాలకు చెందిన బీసీ వర్గీయులు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. దీనికి వల్లపు చంద్రశేఖర్ అలియాస్ చందు సారథ్యం వహించారు. వీరందరికీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి తామందరమూ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. తామందరమూ సంక్షేమపథకాలైన అమ్మఒడి, చేయూత, రైతు భరోసా, చేదోడు, ఆసరా ద్వారా లబ్ధిపొందుతున్నామన్నారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు అమలుచేస్తున్న రుణమాఫీతో స్వశక్తితో తమకాళ్ల మీద తాము వ్యాపారం చేసుకోగలుగుతున్నామని మహిళలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మహిళలు అందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి సయ్యద్ బాజీ, నాయకులు షేక్ ఆదం, ఇమామ్, ముక్కు నరసింహరెడ్డి, షేక్ సుభాని, లింగారెడ్డి, షేక్ అజ్మహల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో పయనిస్తున్న రాష్ట్రం

రొంపిచర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో పయనిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిశ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న గ్రామమైన గార్లపాడులోని రూ.6.78కోట్ల సంక్షేమం, అభివృద్ధి అమలయ్యాయన్నారు. ఇప్పటి వరకు రూ.40 లక్షలతో సీసీరోడ్లు నిర్మించగా, రూ.80 లక్షలతో గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. గ్రామంలో రూ.40లక్షలతో సచివాలయం, రూ.22 లక్షలతో ఆర్‌బీకే కేంద్రం నిర్మించగా మరో పదిరోజుల్లో రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పచ్చవ రవీంద్రబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల చిన్నమ్మాయి రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు గాదె రామిరెడ్డి, గ్రామసర్పంచు కట్టా రాజేశ్వరి వెంకటరెడ్డి, న్యాయవాది సానికొమ్ము రమణారెడ్డి, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, భవనం నరిసిరెడ్డి, ద్రోణాదుల చంద్రారెడ్డి, దేవరపల్లి అంజిరెడ్డి, సాంబిరెడ్డి, సర్పంచులు కామినేని ఆదెయ్య, దుద్దు వీరయ్య, కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, గుండాల వెంకటేష్, గాడిపర్తి సీతయ్య, పాలిమేర వెంకటరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గోపిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వితరణ

నరసరావుపేట ఈస్ట్: స్టేషన్ రోడ్డులోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినీలకు గోపిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ హ్యాండ్‌రైటింగ్ పుస్తకాలను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే పాఠశాలకు బెంచీలు, తరగతి గదులు, రేకుల షెడ్డు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. వేసవి శిక్షణ తరగతులకు హాజరయ్యే 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థినులు తమ పాఠ్యాంశాలతో పాటు బ్రిడ్జి కోర్సులను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ ఇ.ఎం.స్వామి, సుబ్బారెడ్డి, కాకుమాను సదాశివారెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక




విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం నూతన కమిటీ సభ్యులు

వినుకొండ (నూజెండ్ల): స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సంఘం పల్నాడు జిల్లా నరసరావుపేట అధ్యక్షుడు మానం సుబ్బారావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా గాదె కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షులుగా అవ్వారు కోటేశ్వరరావు, కార్యదర్శిగా కాళ్ల కృష్ణమూర్తి, కోశాధికారిగా కోట వీరరాఘవయ్య, సహ అధ్యక్షులుగా భువనగిరి సుబ్రహ్మణ్యంతో పాటు ఉపాధ్యక్షులను, సంయుక్త కార్యదర్శులను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించారు. 2023 సంవత్సరంలో పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను, ఈకేవైసీని పూర్తి చేసి ఎస్‌టీవో కార్యాలయంలో అందజేయాలని సంఘ నాయకులు సూచించారు.

29 అంశాలతో కౌన్సిల్ భేటీ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో పురపాలక సంఘం సాధారణ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో 29 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. సమావేశంలో అంశాలను చర్చించి సభ్యులు ఆమోదించారు. మిషన్ శోభాకృత్ 2023లో భాగంగా నిరుపయోగంగా ఉన్న వస్తువుల బహిరంగ వేలం గురించి, మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్ట్ వద్ద రోడ్డు విస్తరణ, నరసరావుపేట రోడ్డులో నేషనల్ హైవే రోడ్డు విస్తరణ,శానిటేషన్ సిబ్బందికి అవసరమైన సామగ్రి, పనిముట్లను తెప్పించుట, చలివేంద్రాల ఏర్పాటు, ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటు తదతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం



మంటల్ని అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యడ్లపాడు: పొరుగు గ్రామంలో పశువుల కోసం ఎండుగడ్డి కొనుగోలు చేసి గ్రామానికి తీసుకువస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని ఉన్నవ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గొట్టం రత్నకుమారి పొన్నూరు సమీపంలో ఎండుగడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తీసుకువస్తుండగా తీరా గ్రామానికి చేరాకా సర్వీసు తీగలు తగిలి గడ్డిలో మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తమై ఊరి వెలుపలకు తెచ్చి ట్రక్కు లిఫ్ట్ ఎత్తడంతో మండే గడ్డి లోడు మొత్తం రోడ్డుపై పడిపోయింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే రూ.25 వేలుతో కొనుగోలు చేసిన గడ్డి, వామిగా కట్టిన రూ.5 వేల మోకులతో పాటు ట్రక్కు పాక్షికంగా దగ్ధమైంది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే ఊళ్లో లేకుండా ట్రాక్టర్‌ను ఊరిబయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌ను అభినందించారు.

నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్ష

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు మన బడి పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టరు లోతోటి శివశంకరు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం గురువారం జరిగినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. రెండవ విడత ఎంపికైనా 22 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీర్లు జూన్ 10లోగా పనులు నూరుశాతం అయ్యేలా బాధ్యత వహించాలన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం రివాల్వింగ్ ఫండు నిధులు రూ. 2 కోట్లు 75 లక్షలు కేటాయించగా ఇప్పటికే రూ. ఒక కోటి 36 లక్షలు నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. ఇందులో 68 శాతం పనులు పూర్తి అయినట్లు వివరించారు. ఎంపికైన ప్రతి పాఠశాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, భవనాలు మేజరు, మైనరు మరమ్మతులు, రంగులు వేయటం, విద్యుత్ పనులు తదితరవన్నీ పారదర్శకంగా జరిగేలా నిరంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు.

చెత్త సేకరణ ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి



ప్రమాదంలో మృతి చెందిన మరియమ్మ

నరసరావుపేట రూరల్: గ్రామంలో చెత్తను సేకరించే ఆటోను వెనుకకు నడిపే క్రమంలో వృద్ధురాలిని ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని రావిపాడులో గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం... గ్రామంలోని ఎస్‌సీ కాలనీలో చెత్తను సేకరించేందుకు వచ్చిన ఆటో రోడ్డు మలుపులో వెనుకకు నడిపే క్రమంలో రోడ్డుపై నిలిచి ఉన్న కొమ్ముల మరియమ్మ (63)ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరియమ్మను పట్టణానికి తరలిస్తుండగా మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

నెలాఖరులోగా పన్ను చెల్లించి రాయితీ పొందండి

నరసరావుపేట: గడువు ముగిసేలోగా ఆస్తిపన్ను చెల్లించి ఐదుశాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30లోగా 2023–24కు చెందిన ఇల్లు, ఖాళీస్థలాల వార్షిక పన్నులు చెల్లించేవారికి ప్రభుత్వం ఐదుశాతం రాయితీ కల్పించిందన్నారు. పన్నులు చెల్లించేందుకు ఇంకా కేవలం మూడురోజులు మాత్రమే ఉందని, వచ్చే ఆదివారం కూడా కార్యాలయంలో కౌంటర్ పనిచేస్తుందని వెల్లడించారు.

మైనార్టీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): నియోజక వర్గంలోని ముస్లిం మైనార్టీ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూస్తామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హామీ ఇచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ సోదరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, అందుకు గాను పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో మైనార్టీ స్కూల్, కాలేజీ, హాస్టల్‌తో పాటు షాదీ ఖానా నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం తరఫున అనుమతులు తీసుకొచ్చామని, త్వరలోనే 5.50 ఎకరాల్లో నిర్మాణ పనులను మొదలుపెట్టనున్నామని తెలిపారు. వినుకొండలో అన్యాక్రాంతమైన 18 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములను తిరిగి మైనార్టీ మతపెద్దలకు, మసీదుకు అప్పగించామని గుర్తు చేశారు. మిగిలిన మైనార్టీ వక్ఫ్ బోర్డు ఆస్తులను చట్టప్రకారం వారికి అప్పగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనార్టీ అభివృద్ధికి సహకరిస్తుంటే ప్రతిపక్షం వారు నాపై అసత్య ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎలాంటి అసత్య ప్రచారాలు చేసినా, ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముస్లిం సోదరులకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా ముస్లిం మత పెద్దలు అందరూ ఎమ్మెల్యే బొల్లాను కలిసి ముస్లిం మైనార్టీ ఆస్తులు అన్యాక్రాంతం నుంచి కాపాడాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ముస్లిం మైనార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు, సోదరులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక కొత్తపేటలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అన్ని గ్రూపులలో టౌన్ ఫస్ట్ సాధించినట్లు కరస్పాండెంట్ బొడ్డపాటి లింగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీ విభాగంలో ఎస్‌కే జహీన, జె.కావ్యలు 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి స్టేట్ మూడవ ర్యాంక్ సాధించారని తెలిపారు. జూనియర్ బైపీసీ విభాగంలో పి.శ్రీపతి 440 మార్కులకు గాను 433 మార్కులు సాధించి స్టేట్ 4వ ర్యాంక్, ఎస్‌కే మన్సూర్ 440 మార్కులకు గాను 429 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ సీఈసీలో ఎం.తిరుపతిరావు 500 మార్కులకు గాను 470 మార్కులు టౌన్‌ఫస్ట్‌గా నిలిచాడు. సీనియర్ ఎంపీసీ విభాగంలో జి.మల్లేశ్వరి 1000మార్కులకు గాను 985 మార్కులతో టౌన్ ఫస్ట్, ఎ. అనూష 984 మార్కులు సాధించి టౌన్ సెకండ్‌గా నిలిచారు. రమ్యశ్రీ వెయ్యి మార్కులకు గాను 982 మార్కులు సాధించి 3వ స్థానాన్ని దక్కించుకున్నారు. సీనియర్ బైపీసీ విభాగంలో వి.మల్లికార్జుననాయక్ 965 మార్కులు, సీనియర్ సీఈసీ విభాగంలో బి.శివాజీ 947 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలియజేసి మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కె.సాయికుఆర్, బి.మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ ఎం.వి.ఆంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనపరిచిన గీతమ్స్ విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో గీతమ్స్ విద్యార్థుల ప్రతిభ

వినుకొండ(నూజెండ్ల): ఇంటర్మీడియట్ ఫలితాల్లో గీతమ్స్ మహిళా జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఇంటర్మీడియట్ ఫలితాల్లో బైపీసీ విభాగం నందు ఎ. సాయిమానస 1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. సీనియర్ ఎంపీసీ విభాగం నందు కె.హైమ వెంకట సుభాషిని 1000 మార్కులకు గాను 970, ఎం. వైష్ణవి 969, సీహెచ్ అకిల 968 సాధించారు.

జూనియర్ ఎంపీసీ విభాగంలో కె. కావ్య 470 మార్కులకు గాను 451, కె.ప్రవళిక 441 మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీ విభాగంలో ఎండీ ఆయేషా 440 మార్కులకు గాను 394 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన కృష్ణవేణి విద్యార్థులు

గురుకుల విద్యార్థినికి గాయాలు

సిబ్బంది నిర్వాకంపై తల్లిదండ్రుల ఆగ్రహం

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి రామావత్ లక్ష్మీబాయి వంట పదార్థాల గిన్నె మోస్తుండగా జారి పడటంతో ఎడమ చేతి వైపు భాగంలో భుజాల నుండి మోకాలి వరకు కాలి బొబ్బలు ఏర్పడ్డాయి. బొల్లాపల్లి మండలం మన్నేపల్లి తండాకు చెందిన రామావత్ భిక్షు నాయక్ కుమార్తె, బొల్లాపల్లి మండల సొసైటీ అధ్యక్షులు గోవిందనాయక్ మనుమరాలు లక్ష్మీబాయి పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. అయితే బుధవారం సాయంత్రం హాస్టల్ సిబ్బంది వండిన పదార్థాలను ఒక చోటకు చేర్చాలని విద్యార్థులను పురమాయించడంతో పదార్థాల పాత్రలు బరువుగా ఉండటంతో జారిపడగా లక్ష్మీబాయి ఎడమ చేతి వైపు భాగంలో భుజాల నుండి మోకాలి వరకు కాలి బొబ్బలు ఏర్పడ్డాయి. ఈ సంఘటన సాయంత్రం 7 గంటల సమయంలో జరుగగా రాత్రి 9.30 గంటలకు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పిస్తున్నామని రావాల్సిందిగా తెలియజేయడం జరిగిందని కుటుంబసభ్యులు తెలియజేశారు. అయితే రాత్రి వైద్యశాలలో చిన్నారిని చేర్పించి సిబ్బంది తెల్లవారు వరకు అందుబాటులో లేరన్నారు. పల్నాడు జిల్లా డీటీడబ్ల్యూవో వరలక్ష్మి విద్యార్థినీ పరామర్శించడానికి రావడంతో తల్లిదండ్రులు ఆమెకు జరిగిన సంఘటనను వివరించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించే బాధ్యత తమదని, మున్ముందు ఇటువంటివి జరగకుండా చూసుకుంటామని పేర్కొన్నారు.